సాక్షి
మహబూబాబాద్
మంగళవారం | 28 | మార్చి | 2023



ఈ'సారీ'లోటే!

2023-24 ఆర్థిక సంవత్సరానికి కేయూ అంచనా బడ్జెట్ రూ.389 కోట్లకుపైగా ప్రవేశ పెట్టబోతున్నట్లు సమాచారం.
- 8లో▸



తీర్థయాత్రకు వెళ్లొచ్చేసరికి..

తీర్థయాత్రకు వెళ్లి వచ్చే సరికి ఓ వ్యక్తి ఇంట్లో దొంగలు పడి 10తులాల బంగారం, రూ.2లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఈఘటన కోనాపురంలో జరిగింది.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
37.2^0/24.2^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోగా ఉంటుంది.

ఇఫ్తార్ | సహర్
మంగళ 6:34 | బుధ 4:51

రంజాన్ వేళలు

పేదల గూడు గోస

మానుకోటలోని ప్రభుత్వ భూముల్లో వెలసిన గుడిసెలు

- అన్యాక్రాంతం కాకుండా చూడాలని మంత్రి ఆదేశాలు
- అధికారులకు తలనొప్పిగా మారిన వ్యవహారం
- గుట్టలు, శ్మశాన వాటికల్లోనూ గుడిసెలు



పాత బజార్‌లో రైల్వేట్రాక్ పక్కన గుట్టలపై వెలసిన గుడిసెలు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ భూముల్లో ప్రతిరోజు గుడిసెలు వెలుస్తున్నాయి. పలు పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో నిరుపేదలు గుడిసెలు వేసుకొని, గూడు కట్టించాలని పోరాటాలు చేస్తున్నారు. దీంతో పట్టణం నలుమూలల ప్రభుత్వ భూముల్లో వేల సంఖ్యలో గుడిసెలు వెలిశాయి. ఆప్రాంతాలు గుడిసెవాసులతో జాతరలా బహిరంగ సభను తలపిస్తున్నాయి. కాగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ కలెక్టర్ శశాంకకు సూచించారు. ఈమేరకు కలెక్టర్ ఆదేశాలతో సంబంధిత అధికారులకు గుడిసెల తొలగింపు తలనొప్పిగా మారింది. గుడిసెలు తొలగించిన మరునాడే మళ్లీ వేస్తున్నారు. కాగా కురవిరోడ్డులో వెలసిన గుడిసెలను తహసీల్దార్ ఆధ్వర్యంలో సోమవారం తొలగించారు. ఈ మేరకు గుడిసెవాసులు ఆందోళనకు దిగారు. తమకు ప్రభుత్వం స్థలం కేటాయించి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గతంలోనూ..

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉండడంతో సుమారు రెండు దశాబ్దాల క్రితం వరకు ఎర్రజెండా పార్టీల ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసుకుని కాలనీలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, సీపీఐ (ఎంఎల్)పార్టీలతో పాటు పలు సంఘాలు, చివరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలోనూ గుడిసెలు వేస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేస్తున్నారు.

వందల ఎకరాల్లో..

మానుకోట మున్సిపాలిటీలో సర్వే నంబర్ 255, 287, 551లోని ప్రభుత్వ భూమిల్లోని వందల ఎకరాల్లో పేదలు గుడిసెలు వేసుకున్నారు. కురవి రోడ్డులోని సర్వే నంబర్ 255లోని నాలుగైదు ఎకరాల్లో వందల సంఖ్యలో గుడిసెలు వేశారు. అనంతారం రోడ్డు, డబుల్ బెడ్రూం ఇళ్ల పక్కన, గాయత్రిగుట్టపై, దాని చుట్టూ సుమారు 15 ఎకరాల భూమిలో గుడిసెలు వేసుకున్నారు. పాత బజార్‌లో వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో దివ్యాంగులు, రైల్వే గేట్ పక్కన పలు పార్టీల ఆధ్వర్యంలో వేల సంఖ్యలో గుడిసెలు వేశారు.

అధికార పార్టీ ఆధ్వర్యంలోనూ..

బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఇల్లెందు రోడ్డులో కేటీఆర్‌కాలనీ ఏర్పాటు చేశారు. అలాగే నర్సంపేట రోడ్డులో 26వ వార్డు సిగ్నల్ కాలనీలో సుమారు నాలుగు ఎకరాల్లో పేదలు గుడిసెలు వేశారు. ఇలా పలు పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో మానుకోట పట్టణం, శివారులో సుమారు 150ఎకరాల్లో గుడిసెలు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. కానీ రెవెన్యూ అధికారులు మాత్రం 18ఎకరాల్లోనే పేదలు గుడిసెలు వేసినట్లు చెబుతున్నారు.

గుట్టలు, శ్మశాన వాటికల్లో..

కొత్త బజార్‌లోని చెత్త డంపింగ్‌యార్డు స్థలాలు, ఆ పక్కనే ఉన్న శ్మశాన వాటికల ప్రాంతాల్లో కూడా పలు పార్టీల ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసుకున్నారు. అలాగే గుట్టలపై కూడా గుడిసెలు వేశారు. గాయత్రి గుట్ట, పాత కలెక్టరేట్ సమీపంలోని గుట్టలు, పాత బజార్‌లోని రైల్వేట్రాక్ పక్కన గల గుట్టలపై కూడా గుడిసెలు వెలిశాయి. కాగా ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటుబ్యాంక్‌ను నష్టపోతామని ప్రజాప్రతినిధులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొన్ని చోట్ల నాయకుల ఆధ్వర్యంలోనే గుడిసెలు వేసినట్లు ప్రచారం ఉంది.

స్థలాల కొరత..

ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర అవసరాలకు స్థలాల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో అధికారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.



ఆందోళన చేస్తున్న గుడిసెవాసులు

ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ కోసం ఇల్లెందు రోడ్డులో 41ఎకరాలు కేటాయించగా, ఆ ప్రాంతంలో సైతం పేదలు గుడిసెలు వేసుకోగా.. ఈనెల 26న కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ నాగభవాని ఆధ్వర్యంలో గుడిసెలను తొలగించారు. అయితే పేదలు మరుసటి రోజే మళ్లీ గుడిసెలు వేసుకున్నారు. దీంతో జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల కోసం భూ సమస్యలు వస్తున్నాయి.

దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు



ప్రభుత్వ భూముల్లో వేల సంఖ్యలో పేదలు గుడిసెలు వేశారు. వారిలో స్థానికులు తక్కువగా ఉన్నారు. ఇల్లెందు, బయ్యారం, కురవి మండలంలోని కొత్తూరు, టేకుల గూడెం, దంతాలపల్లి మండలవాసులే ఎక్కువగా గుడిసెలు వేశారు. దళారుల మాటలు నమ్మి గుడిసెలు వేసుకుని ఆర్థికంగా నష్టపోవద్దు. అనవసరంగా కేసుల పాలుకావొద్దు. ప్రభుత్వ కార్యాలయాలకే స్థలాల కొరత ఉంది. ప్రజలు అర్థం చేసుకోవాలి.

– నాగభవాని, మానుకోట తహసీల్దార్

అవార్డులు సాధించిన సర్పంచ్‌లతో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు



తెలంగాణలో ప్రజారంజక పాలన

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మహబూబాబాద్: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో లేవని, తెలంగాణలో ప్రజారంజక పాలన సాగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సతత్ వికాస్ పురస్కార్ జిల్లాస్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, విశిష్ట అతిథులుగా మంత్రి సత్యవతి రాథోడ్, జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ హాజరై 27మంది సర్పంచ్‌లకు అవార్డులు అందజేసి సన్మానించారు. అనంతరం మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ... పురస్కారం మరింత బాధ్యతను పెంచుతుందన్నారు. గతంలో సర్పంచ్‌లకు మంజూరైన నిధులు సరిపోయేవి కావని, అరకొర నిధులు తాగునీటికే సరిపోయేవన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక మిషన్ భగీరథ పథకంతో తాగునీటికి శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. చిన్న గ్రామపంచాయతీలకు సైతం ట్రాక్టర్లు మంజూరు చేయడం వల్ల చెత్త తరలింపు సులువైందన్నారు. ట్రాక్టర్లు జీపీలకు ఆదాయ వనరుగా మారడం మరో అదృష్టమన్నారు. గతంలో గంగదేవిపల్లికే అవార్డులు వచ్చేవని, ప్రస్తుతం చాలా జీపీలకు అవార్డులు వస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్రంతో పాటు రాష్ట్రం కూడా నిధులను సమానంగా కేటాయిస్తుందని, దీంతో పల్లెలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ.. అవార్డులు పనితనానికి నిదర్శనమన్నారు. దేశమంతా తెలంగాణ వైపే చూసేవిధంగా సమైక్యంగా కృషి చేయడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాస్థాయి అవార్డులు సాధించిన 27జీపీల్లో అభివృద్ధికి రూ.72 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. సర్పంచ్‌లు ఖర్చు చేసిన నిధులను త్వరలోనే మంజూరు చేస్తామని తెలిపారు. జిల్లాలో మహిళల ఆర్థికాభివృద్ధికి అన్ని విధాలుగా అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

50 కేంద్రాల్లో 'పది' పరీక్షలు

- డీఈఓ రామారావు

తొర్రూరు: జిల్లాలోని 50పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించనున్నామని డీఈఓ రామారావు తెలిపారు. వచ్చే నెల 3నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అమ్మాపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను డీఈఓ సందర్శించారు. పరీక్ష కేంద్రాల్లోని సౌకర్యాలపై ఆరా తీశారు. జిల్లా వ్యాప్తంగా 50 పరీక్ష కేంద్రాల్లో 8,661 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. ప్రతి కేంద్రం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్, ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం అమ్మాపురం ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని డీఈఓ పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ గుగులోతు రాము, హెచ్‌ఎంలు బీవీ రావు, లక్ష్మీనారాయణ, మురళీకృష్ణ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ రామారావు

న్యూస్‌రీల్

పెండింగ్ వినతులు పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్



మహబూబాబాద్: ప్రజావాణిలో అందిన పెండింగ్ వినతులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా.. అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డేవిడ్ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అభిలాష అభినవ్ మాట్లాడుతూ.. సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం అని అధికారులు గుర్తించుకోవాలన్నారు. ఇంటి పన్నులు సకాలంలో చెల్లించేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సమస్య రాకుండా యాక్షన్ ప్లాన్‌తో ముందుకెళ్లాలని సూచించారు. ప్రజావాణిలో 132 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు వీరభద్రస్వామి హుండీ లెక్కింపు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నేడు(మంగళవారం) నిర్వహిస్తామని ఆలయ ఈఓ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ సిబ్బంది సకాలంలో హాజరుకావాలని సూచించారు.

ఆలయ భూముల సర్వే



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ భూములను నేడు (మంగళవారం) సర్వే చేస్తామని ఆలయ ఈఓ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళ, బుధవారాల్లో సర్వే నిర్వహిస్తామని వివరించారు. ఆలయ భూములు అన్యాక్రాంతం అయ్యాయనే భావించిన ఆలయ అధికారులు కలెక్టర్ శశాంకు ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాల మేరకు సర్వే చేయడం జరుగుతుందన్నారు. సర్వే నంబర్లు 78, 79, 88, 169, 602, 603, 604, 642లో సర్వే ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు.

క్రెచ్ కేంద్రం ప్రారంభం

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఉద్యోగస్తుల పిల్లల కోసం క్రెచ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా సోమవారం మంత్రి సత్యవతిరాథోడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, కలెక్టర్ శశాంక, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దేశానికే ఆదర్శం



మరిపెడ: సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలిచారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మానుకోట ఎంపీ మాలోత్ కవిత అన్నారు. సోమవారం మరిపెడలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కవిత మాట్లాడుతూ.. డోర్నకల్ నియోజక వర్గం అంటే రెడ్యానాయక్ సొంత ఇల్లు అన్నారు. ఆ ఇంటికి పెద్దదిక్కుగా ఉండి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు.అనంతరం మాజీ ఎమ్మెల్సీ సతీష్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్, డీఎస్ రవిచంద్ర, జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీలు అరుణరాంబాబు, పద్మ వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోతు సింధూరరవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి కృషి

- మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్: ఎన్టీఆర్ స్టేడియం మరింత అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి సత్యవతిరాథోడ్ హామీ ఇచ్చారు. స్టేడియంలో సోమవారం కాళోజీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి మంత్రి వాకింగ్ చేస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చేపట్టాల్సిన పనులపై చర్చించారు. మంత్రి వాకింగ్ చేసే సమయంలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తారసపడ్డారు. కొంతసేపు వారు మాట్లాడుకున్నారు. స్టేడియంలో జిమ్ ఇతర ఏర్పాట్లు బాగున్నాయని మంత్రికి చెప్పారు. జిల్లా అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మంత్రి వాకర్స్‌ను ఉద్దేశించి మాట్లాడారు. స్టేడియంలో అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. గుండెపోటుకు గురైన వ్యక్తికి సత్వరమే సీపీఆర్ చేస్తే వారి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. వాకర్స్ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ శశాంక, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



వాకర్స్‌తో మాట్లాడుతున్న మంత్రి

సమస్యలు పరిష్కరిస్తాం

- అందుకే మండలస్థాయిలో ప్రజావాణి
- బయ్యారం గ్రీవెన్స్‌లో కలెక్టర్ శశాంక

బయ్యారం: ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించేందుకే మండలస్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శశాంక అన్నారు. సోమవారం బయ్యారంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు సమాధానం ఇచ్చే బాధ్యత అధికారులపై ఉందన్నారు. కాగా ప్రజావాణిలో 52దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని

- మండలంలోని సింగారం గ్రామానికి చెందిన గుగులోత్ భోజ్య ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న తన కొడుకు సాకటం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అలాగే జగ్నాతండాకు చెందిన ఇస్లావత్ జాంకీ అనే వృద్ధురాలు తన కొడుకులు సాకటం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు అందించింది.
- బయ్యారం పెద్దచెరువు కాల్వల మరమ్మతులు చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేర్వేరుగా కలెక్టర్‌కు వినతులు సమర్పించారు.
- యాసంగిలో తమకు రావాల్సిన రైతుబంధు డబ్బులు ఇప్పటి వరకు ఖాతాల్లో జమకాలేదని, తమకు వెంటనే డబ్బులు ఇప్పించాలని కలెక్టర్‌కు పలువురు రైతులు దరఖాస్తులు అందజేశారు.
- మండలంలో ఇటుకబట్టీల నిర్వహణలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఇటుకబట్టీల యజమానులు కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. అలాగే ఇటుకబట్టీల వల్ల తమ పంటలు దెబ్బతింటున్నాయని కొందరు రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- మండలంలోని ఉప్పలపాడు పంచాయతీలో విద్యుత్‌సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం కేటాయించడంతో పాటు ఉప్పలపాడులో రహదారిపై ఉన్న స్థూపంను తొలగించాలని సొసైటీ అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి కలెక్టర్‌కు విన్నవించారు.
- మండలంలోని పలు గ్రామాల్లో సాగులో ఉన్న గిరిజన, గిరిజనేతర రైతులకు పట్టాలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్టీ విభాగం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు దరఖాస్తు అందజేయగా, బయ్యారంలో కోతుల, కుక్కల బెడదను నివారించాలని సేవాలాల్‌సేన ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, ఆర్డీఓ కొమురయ్య, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక

నిద్ర పోతే... బాధ పోతది



చెట్టుకింద నిద్రపోతున్న మహిళ

తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ శశాంక నిర్వహించిన ప్రజావాణిలో తన బాధను చెప్పుకొనేందుకు ఓ మహిళ వచ్చింది. ఆ సమయంలో ఫిర్యాదుదారులు ఎక్కువగా ఉండడంతో అక్కడే ఉన్న చెట్టు కింద కునుకుతీసింది. ఇది చూసిన పలువురు నిద్రపోతే అన్ని బాధలు పోతాయని చమత్కరించారు.

ప్రమాణ స్వీకారోత్సవంలో ప్రొటోకాల్ రగడ..

- ఫ్లెక్సీలో ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఫొటో లేకపోవడంతో ఆందోళన
- ఫొటో ఏర్పాటుతో సద్దుమణిగిన వివాదం

కేసముద్రం: వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో భాగంగా సభావేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ ఫొటో లేకపోవడంతో ఆయన అనుచరులు ఆందోళనకు దిగారు. సోమవారం కేసముద్రం మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారంలో భాగంగా సభావేదికపై ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ప్రొటోకాల్ ప్రకారం అందులో రెడ్యానాయక్ ఫొటో లేకపోవడంతో ఆయన అనుచరులు ఆందోళనకు దిగారు. చివరకు రెడ్యానాయక్ ఫొటో ఫ్లెక్సీని సభావేదికపై ఏర్పాటు చేయడంతో ఆందోళన విరమించారు. అనంతరం మార్కెట్ చైర్‌పర్సన్‌గా నీలం సుహాసిని, వైస్ చైర్మన్‌గా రవి, డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేసి, బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మంత్రి సత్యవతిరాథోడ్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రమోహన్, జెడ్పీటీసీ శ్రీనాథ్‌రెడ్డి, గాయత్రి గ్రానైట్ అధినేత వద్దిరాజు కిషన్, డీఎంఓ వెంకట్‌రెడ్డి, సర్పంచ్ బట్టు శ్రీనివాస్, నీలం దుర్గేష్, సొసైటీ చైర్మన్ దికొండ వెంకన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళనకు దిగిన ఎమ్మెల్యే రెడ్యానాయక్ అనుచరులు

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

గార్ల: గార్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షల్లో మాస్‌కాపీయింగ్ జరగకుండా ఇన్విజిలేటర్లు తగు జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. అనంతరం ఫ్లయింగ్ స్క్వాడ్స్ సైతం పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. డీఐఈఓ వెంట చీఫ్ సూపరింటెండెంట్ రఘుబాబు తదితరులు ఉన్నారు.

సమస్యలు త్వరగా పరిష్కరించాలి

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మహబూబాబాద్ రూరల్: పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. ప్రజావాణిలో భాగంగా మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2వరకు మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎస్పీ తెలిపారు.

ఎస్పీని కలిసిన అడిషనల్ ఎస్పీ..

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఆర్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న రేల జనార్దన్ రెడ్డి పదోన్నతిపొంది అడిషనల్ ఎస్పీ(ఏఆర్)గా జగిత్యాలకు వెళ్తున్న సందర్భంగా ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మహబూబాబాద్ జిల్లాలో ఏఆర్ డీఎస్పీగా జనార్దన్ రెడ్డి అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, ఆర్ఐలు పూర్ణచందర్, నరసయ్య, లాల్‌బాబు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

రాహుల్‌గాంధీపై అనర్హత వేటు అప్రజాస్వామికం



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ, పక్కన నాయకులు

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

మహబూబాబాద్: రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడం అప్రజాస్వామికమని, దానిని తీవ్రంగా ఖడిస్తున్నామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన దీక్షకు నారాయణ సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాజకీయ కుట్రలో భాగంగానే రాహుల్‌గాంధీపై వేటు వేశారని మండిపడ్డారు. ప్రజాకోర్టులో ప్రధాని మోదీకి దండన తప్పదని హెచ్చరించారు. రాహుల్‌గాంధీ విషయంలో అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ఉద్యమిస్తామన్నారు.

చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ

నెహ్రూసెంటర్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరిస్తుందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాడి నాలుగువేల మంది అమరులయ్యారని, పది లక్షల ఎకరాలను పేదలకు పంచిపెట్టామన్నారు. అంతటి ఘనమైన చరిత్ర, పోరాటాన్ని హేళన చేయడం సరికాదన్నారు. స్వాతంత్ర్య పోరాటం, సాయుధ పోరాటంలో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని, చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూముల్లో నిర్మించుకున్న పేదల ఇళ్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, అజయ్‌సారథిరెడ్డి, కర్రె భిక్షపతి, పంజాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ మాజీ రిజిస్ట్రార్ లక్ష్మీపతి మృతి


లక్ష్మీపతి(ఫైల్)

కేయూ క్యాంపస్: కేయూ జువాలజీ విభాగం విశ్రాంత ఆచార్యులు, మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వడ్లకొండ లక్ష్మీపతి(78) హైదరాబాద్‌లో సోమవారం మృతి చెందారు. మార్నింగ్ వాక్ చేస్తూ గుండెపోటుతో మరణించారని సమాచారం. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. లక్ష్మీపతి కేయూ రిజిస్ట్రార్‌గా 2003 నుంచి 2005 వరకు పని చేశారు. జువాలజీ విభాగంలో దాదాపు 30 ఏళ్ల పాటు అధ్యాపకుడిగా పని చేశారు. ఆయన ఉద్యోగ విరమణ పొందాక యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, నైపర్, ఫార్మసీ సంస్థలో అతిథి ఆచార్యులుగా పని చేశారు. లక్ష్మీపతి మృతికి కేయూ వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు, జువాలజీ విభాగాధిపతి మామిడాల ఇస్తారి సంతాపం తెలిపారు.

ఇద్దరికి జీవిత ఖైదు

నర్సింహులపేట: చిన్నగూడూరు మండలం గుండంరాజుపల్లిలో 2014లో కుటుంబ తగాదాలతో కుంట యాదగిరిని హత్య చేసిన ఘటనలో ఇద్దరు నిందితులకు సోమవారం మహబూబాబాద్ జిల్లా కోర్టు జీవిత ఖైదు విధించినట్లు ఎస్సై మంగీలాల్ తెలిపారు. యాదగిరి హత్యకు గురైనట్లు డిసెంబర్ 2014లో ఆయన కుమారుడు నరేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే గ్రామానికి చెందిన కుంట సురేశ్, చిల్ల ఉప్పలయ్యను నిందితులుగా పేర్కొని జిల్లా కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. నిందితులిద్దరికీ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి రూ.1000 జరిమానా, జీవిత ఖైదు విధించినట్లు ఎస్సై తెలిపారు. ఈకేసులో ట్రయల్ నడిపిన పీపీ వెంకటేశ్వర్లు, డీఎస్పీ రఘు, సీఐ సత్యనారాయణ, కోర్టు లైజన్ ఆఫీసర్ ఎండి.గాలీబ్, ఎస్సై మంగీలాల్, కోర్టు పీసీ నరేందర్‌ను ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించారు.

ఈ'సారీ' లోటే!



- కేయూ అంచనా బడ్జెట్ రూ.389 కోట్లు!
- రూ.15 కోట్లకుపైగా లోటు బడ్జెట్ చూపే అవకాశం
- నేడు అకాడమిక్ సెనేట్ సమావేశంలో బడ్జెట్‌పై చర్చ, ఆమోదం

కేయూ క్యాంపస్: కేయూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి వార్షిక అంచనాల బడ్జెట్ రూ.389 కోట్లకుపైగా ప్రవేశపెట్టబోతున్నట్లు సమాచారం. మంగళవా రం ఉదయం 11 గంటలకు 38వ అకాడమిక్ సెనేట్‌లో అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఈబడ్జెట్‌లో ప్రభుత్వం నుంచి బ్లాక్ గ్రాంట్ రూపేణారూ 127.55 కోట్లు రానున్నాయి. ఆనిధులు అధ్యాపకుల, నాన్‌టీచింగ్, పెన్షనర్ల జీతభత్యాలకే సరిపోనున్నాయి. మిగతా అంచనా బడ్జెట్‌కు అనుగుణంగా కేయూ అంతర్గత నిధుల నుంచి, పరీక్షల విభాగం, ఎస్‌డీఎల్‌సీఈ, ఎస్‌ఎఫ్‌సీ కోర్సుల నుంచి ఇతర అకాడమిక్ పరంగా ఫీజుల వనరుల నుంచి సమీకరించబోతున్నారు. ఆయా నిధులను వ్యయాలుగా చూపెట్టబోతున్నారు. ప్లానింగ్, నాన్‌ప్లానింగ్ బడ్జెట్‌గా 8 అంశాల్లో బడ్జెట్‌ను ప్రతిపాదించనున్నారు. ప్రభుత్వం ఇచ్చే బ్లాక్‌గ్రాంట్ అధ్యాపకుల, ఉద్యోగుల వేతనాలకే సరిపోతుండగా.. టైంస్కేల్, తాత్కాలిక ఉద్యోగులకు మాత్రం.. యూనివర్సిటీ తన అంతర్గత నిధుల నుంచే వేతనాలను చెల్లించుకోవాల్సిన పరిస్థితి. టీచింగ్, నాన్‌టీచింగ్ పెన్షనర్ల బెనిఫిట్స్‌ను కూడా యూనివర్సిటీ అంతర్గత నిధుల నుంచే ఇవ్వాల్సి వస్తోంది. ఆబెనిఫిట్స్ ఇవ్వడంలోనూ జాప్యం అవుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఇచ్చే బ్లాక్‌గ్రాంట్‌తో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో బ్లాక్ గ్రాంట్ రూ.9.34 కోట్లు పెరిగింది. అయినప్పటికీ ఇది సరిపోదు. అలాగే.. అధ్యాపకుల, ఉద్యోగులకు పీఆర్సీతో వేతనాలు పెరిగాయి. డీఏలు కూడా చెల్లించాల్సి ఉంటుంది. రూ.15 కోట్లకు పైగా లోటు బడ్జెట్‌ను చూపెట్టబోతున్నట్లు సమాచారం. కాగా.. అన్ని కోర్సులకు ఫీజులు భారీగానే పెంచారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తే కొంత యూనివర్సిటీకి ఊరట కలిగే అవకాశం ఉంది.

అకాడమిక్ కార్యక్రమాలపై చర్చేది?

కేయూలో సెనేట్ సభ్యుల కొరత ఉంది. యూనివర్సిటీకి 16 ఏళ్ల క్రితం సెనేట్ సభ్యులను నియమించారు. కనీసం ఐదారేళ్లకోసారి సెనేట్ సభ్యులను నియమించాల్సి ఉంటుంది. కానీ రీ ఆర్గనైజ్ చేయడం లేదు. పలువురు సెనేట్ సభ్యులు మరణించినా.. వారి స్థానంలో కొత్తవారిని నియమించడంలేదు. సెనేట్‌ను కొత్తగా పునరుద్ధరించాలనే డిమాండ్ వ్యక్తం అవుతున్నా.. యూనివర్సిటీ అధికారులు అంతగా.. పట్టించుకోవడం లేదు. అకాడమిక్ సెనేట్, బడ్జెట్‌ను కలిపి సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. బడ్జెట్‌ను ప్రవేశపెట్టాక కొద్దిసేపు చర్చించిన అనంతరం చప్పట్లతో ఆమోదించినట్లుగా ప్రకటిస్తున్నారు. అకాడమిక్ కార్యక్రమాలకు విద్యా సంవత్సరంలో ప్రత్యేకంగా చర్చించాలనేది ప్రతీ సెనేట్ సమావేశంలో పలువురు అభిప్రాయపడుతున్నప్పటికీ యూనివర్సిటీ అధికారులు ఓకే అనడం ఆతర్వాత మరిచిపోవడం పరిపాటిగా మారింది. అకాడమిక్ సెనేట్‌లో ఎప్పుడూ పూర్తి స్థాయిలో అకాడమిక్ కార్యక్రమాలపై చర్చలు జరగలేదంటే అతిశయోక్తి లేదు. ప్రస్తుతం 45 మంది అకాడమిక్ సెనేట్ సభ్యులున్నట్లు తెలుస్తోంది. అందులో ఎంతమంది హాజరవుతారో మంగళవారం తెలియనుంది.

రూ.22 కోట్లు పెరిగిన బడ్జెట్!

గత ఆర్థిక సంవత్సరం 2022–23లో రూ.367 కోట్లకుపైగా.. అంచనా బడ్జెట్‌ను ప్రతిపాదించిన విషయం తెలిసిందే. అయితే.. ప్రభుత్వం నుంచి బ్లాక్ గ్రాంట్ రూపేణా రూ.188.22 కోట్లు యూజీసీ ఏరియర్స్ రూ 32.81 కోట్లు మరో రూ.183.60 కోట్లు అంతర్గత నిధుల నుంచి సమీకరిస్తారని అంచనా బడ్జెట్‌లో పేర్కొన్నారు. లోటు రూ.33 కోట్లు చూపెట్టారు. అయితే ఆర్థిక సంవత్సరంలో రూ.211 కోట్లకు పైగా వ్యయం అయినట్లుగా తెలుస్తోంది. కాగా.. ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంటులో రూ.15.50 కోట్లు విడుదల చేయలేదని తెలుస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో కూడా ప్లానింగ్, నాన్‌ప్లానింగ్ బడ్జెట్‌లో రూ.389 కోట్లకు పైగా అంచనా ప్రతిపాదించి ప్రవేశపెట్టి అందులో ఆదాయ వ్యయాలను కూడా అంచనా వేశాక సుమారు రూ.15 కోట్లకు పైగానే లోటు బడ్జెట్ ఉండబోతోందని తెలుస్తోంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రూ.22 కోట్లకుపైగా ఈఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ పెంచినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీకి ఇచ్చే నిధులకంటే వ్యయం ఎక్కువగా ఉంటుంది. అభివృద్ధి పనులకు గత ఎనిమిదేళ్లుగా ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు.

బడ్జెట్, వార్షిక నివేదిక, స్టాండింగ్ కమిటీ మినిట్స్

- కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు

కేయూ క్యాంపస్: కేయూ సెనేట్‌హాల్‌లో ఈనెల 28న ఉదయం 11గంటలకు జరిగే 38వ అకాడమిక్ సెనేట్ సమావేశంలో పద్దుల ఆమోదం, వార్షిక నివేదిక, వార్షిక బడ్జెట్ అంచనాల సమర్పణ ఉంటుందని సోమవారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈసమావేశంలో 2020–2021 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పద్దుల ఆమోదం, 2023–24 ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్ అంచనాల సమర్పణ ఉంటుందని పేర్కొన్నారు. 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించిన స్టాండింగ్ కమిటీ మినట్స్‌ను కూడా ఉంటుందని తెలిపారు. సమావేశంలో పాలకమండలి సభ్యులు, వివిధ విభాగాల డీన్‌లు, ప్రిన్సిపాళ్లు, అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్ష రాస్తున్న విద్యార్థికి ఫిట్స్

ఎంజీఎంకు తరలింపు


చికిత్స పొందుతున్న విద్యార్థి ధరణి

ఎంజీఎం: వరంగల్ ఏవీవీ కళాశాలలో మేధా ఇంటర్మీడియట్ కళాశాలకు చెందిన ధరణి సోమవారం ఇంటర్ పరీక్ష రాస్తున్న క్రమంలో ఫిట్స్ వచ్చింది. కళాశాల సిబ్బంది వెంటనే అప్రమత్తమై 108 అంబులెన్స్‌లో ఎంజీఎంకు తీసుకెళ్లి చికిత్స అందించారు. విద్యార్థి తల్లిదండ్రులు ఎంజీఎంలో చికిత్స పొందుతున్న కూతురును ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

సంగెం: కుటుంబ సమస్యలు, వడగండ్ల వానతో పంట నష్టం ఇవన్నింటితో జీవితంపై విరక్తి చెందిన మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన కొలువుల నీల(52) ఆదివారం రాత్రి కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది. నీల కుమారుడికి రెండేళ్ల క్రితం ఏనుగల్లు గ్రామానికి చెందిన రవళికతో వివాహం జరిగింది. ఆమె ఆరోగ్యం బాగలేక రూ.3 లక్షలు చికిత్స కోసం ఖర్చయ్యాయి. కాగా.. కుమారుడికి విడాకులు ఇవ్వాలనుకున్నారు. ఇరు వర్గాల పెద్ద మనుషుల తీర్పు ప్రకారం.. రూ. 20 లక్షలు చెల్లించాలని నిర్ణయించారు. కాగా.. మూడెకరాల పది గుంటల భూమిని కౌలుకు తీసుకుని అందులో మిర్చి, మొక్కజొన్న సాగు చేశారు. ఇటీవలి వడగండ్ల వానకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో కోడలు విడాకుల కోసం రూ. 20 లక్షలు, పంటల కోసం చేసిన అప్పులు తీర్చే పరిస్థితి లేక మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి సీతారాంనగర్ సమీపంలో ఎస్సారెస్పీ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది. భర్త సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై భరత్ తెలిపారు.

మృతదేహం లభ్యం


నీల మృతదేహం

చెన్నారావుపేట: మండలంలోని సూర్యపేట తండా సమీపంలోని ఎస్సారెస్పీ (డీబీఎం–40) కాలువలో సోమవారం ఉదయం నీల మృతదేహం లభ్యమైంది. అద్దబాట తండాకు చెందిన రైతు వాల్యానాయక్ కొట్టుకొస్తున్న మృతదేహాన్ని ఆపి తాడు సాయంతో సమీపంలో చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్సై తోట మహేందర్ మృతదేహాన్ని పరిశీలించారు.

తాగొద్దన్నందుకు..

శాయంపేట: మద్యం తాగొద్దని భార్య వారించినందుకు మండలంలోని మందారిపేట గ్రామానికి చెందిన కుక్కల సతీశ్ (33) సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సతీశ్ గొర్రెలను కాస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంత కాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఉదయాన్నే మద్యం సేవించిన సతీశ్ ఇంటికి రావడంతోనే అతడి భార్య నాగరాణి గొర్రెలను మేపకుండా మద్యం తాగడం ఎందుకని? మద్యం సేవించవద్దని మందలించింది. నాగరాణి, ఆమె అత్త లింగమ్మ ఇద్దరూ గొర్రెలను మేపేందుకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి సతీశ్ ఇంట్లో తాడుతో ఉరేసుకుని మృతి చెందాడు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు తెలిపారు.

రైలుకింద పడి యువకుడు..


కార్తీక్(ఫైల్)

జనగామ: జనగామ జిల్లా యశ్వంతాపూర్ వాగు వద్ద రైలు కింద పడి భువనగిరి యాదాద్రి జిల్లా ఆలేరు మండలం పటేల్‌గూడెం గ్రామానికి చెందిన కార్తీక్(21) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్నెళ్ల క్రితం గుండెపోటుతో మృతి చెందిన తండ్రిని తలుచుకుంటూ.. మానసిక వేదనకు గురైన కార్తీక్ సోమవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ కానిస్టేబుల్ నరేశ్ తెలిపారు.

తీర్థయాత్రకు వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల!

- కోనాపురంలో దొంగల బీభత్సం
- 10 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు అపహరణ


పరిశీలిస్తున్న ఏసీపీ సంపత్‌రావు

చెన్నారావుపేట: ఈనెల 17న కుమారుడి వివాహం జరిగింది. నూతన వధూవరులతో ఆ కుటుంబం తీర్థయాత్రలకు వెళ్లింది. వచ్చేసరికి దొంగలు ఉన్నదంతా ఊడ్చుకెళ్లారు. మండలంలోని కోనాపురానికి చెందిన మండల సుధాకర్ ఇంట్లో దొంగలు బీభత్సం సృష్టించారు. శోభ–సుధాకర్ దంపతులు ఈనెల 17న తమ కుమారుడు నాగరాజు వివాహాన్ని జరిపించారు. నూతన వధూవరులను తీసుకొని వేములవాడకు ఆదివారం వెళ్లారు. ఈక్రమంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి లోనికి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న బీరువాను పగులగొట్టి అందులో ఉన్న 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న నర్సంపేట ఏసీపీ సంపత్‌రావు, సీఐ హతీరాం నాయక్, ఎస్సై తోట మహేందర్ పోలీస్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌తో చోరీ తీరుపై విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్ అధికారులు వేలిముద్రల నమూనాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు.

బైక్ ఒకరిది.. జరిమానా మరొకరికి!

- డీజీపీకి ట్విట్టర్‌లో జనగామ వాసి ఫిర్యాదు


డీజీపీకి సంపత్ ట్విట్టర్‌లో చేసిన ఫిర్యాదు


జరిమానా చెల్లించాలని ట్రాఫిక్ పోలీసులు పంపించిన చలాన్

జనగామ: తప్పు చేసింది ఒకరు.. జరిమానా చెల్లించాలని నోటీసులు మరొకరికి. ఈట్విస్ట్‌ను ట్విట్టర్‌లో డీజీపీకి జనగామ వాసి ఫిర్యాదు చేశారు. జనగామలోని జయశంకర్‌నగర్‌కు చెందిన పబ్బా సంపత్‌కు (టీఎస్ 27 సీ4258) నంబర్‌గల ద్విచక్ర వాహనం ఉంది. స్థానికంగా ఉండే సంపత్ ఈమధ్య కాలంలో బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్లలేదు. ఎల్‌బీనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ స్కూటీ యజమాని వద్ద డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడంతో పాటు విరిగిపోయిన నంబర్ ప్లేట్ కనిపించడంతో పోలీసులు రూ.7వందల జరిమానా విధించారు. కానీ ఆన్‌లైన్‌లో స్కూటీ నెంబర్ ప్లేట్ విరిగి ఉన్న ఫోటోను పోస్టు చేసి, జరిమానా మాత్రం జనగామకు చెందిన సంపత్‌కు మెసేజ్ పంపించారు. దీన్ని చూసి ఆందోళన చెందిన సంపత్... నేరుగా డీజీపీకి ట్విట్టర్‌లో ఫిర్యాదు చేశారు. ‘అయ్యా డీజీపీ గారు... బండి నంబర్ కనిపించకపోతే ఎవరికి పడితే వారికి జరిమానా విధిస్తారా? మీరు ఆన్‌లైన్‌లో పోస్టు చేసిన బైక్ మాది కాదు.. సరి చూసుకోండి’ అంటూ ట్వీట్ చేశారు.

గంజాయితో పట్టుబడిన ఇద్దరి అరెస్ట్

- పరారీలో ఒకరు


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కాజీపేట: కాజీపేటలో సోమవారం 2.100 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్ రెడ్డి తెలిపారు. కాజీపేట టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన మహాద్ నజీమ్, జమ్మికుంటకు చెందిన పాకాల విక్రత్‌రెడ్డి, సాహెబ్ గంజాయితో పట్టుబడ్డారు. వీరిలో విక్రత్‌రెడ్డి, నజీమ్‌లను పోలీసులు అరెస్ట్ చేయగా.. సాహెబ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుల నుంచి గంజాయితో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సీఐలు కె.శ్రీనివాస్‌రావు, ఎన్.వెంకటేశ్వర్లు, ఎస్సైలు లవన్‌కుమార్, ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్కను కొట్టిన తమ్ముడిపై కేసు

ఖిలా వరంగల్: వారసత్వంగా వచ్చే ఆస్తి విషయంలో అక్కను కొట్టిన తమ్ముడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాంబయ్య తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం.. వరంగల్ రంగశాయిపేట నెహ్రూ విగ్రహం సమీప కాలనీకి చెందిన గుమ్మడి ఇందిర తల్లిదండ్రుల ఆస్తి విషయంపై అతడి తమ్ముడు మునికుంట్ల ఆగయ్యతో సోమవారం గొడవ జరిగింది. ఈగొడవల్లో అక్కపై తమ్ముడు దాడి చేశాడు. ఆగయ్యపై ఇందిర ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నకిలీ డాక్యుమెంట్ సృష్టించిన వ్యక్తిపై..

ఖిలా వరంగల్: మామ ఇంటిపై నకిలీ డాక్యుమెంట్ సృష్టించి భయభ్రాంతులకు గురి చేస్తున్న అల్లుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మిల్స్‌కాలనీ ఏరియా గాంధీనగర్‌లో చింతపండు సంజీవ్‌కు ఇల్లు ఉంది. అతడి అల్లుడైన లక్కం ప్రసాద్ మామ ఇంటిని కాజేసేందుకు నకిలీ డాక్యుమెంట్ సృష్టించి మామను బెదిరిస్తున్నాడు. దీంతో చింతపండు సంజీవ్ చిన్నాన్న శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుమార్ తెలిపారు.

కుక్క దాడిలో బాలుడికి గాయాలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలం బలరాం తండాకు చెందిన లకావత్ భాస్కర్ ఎనిమిదేళ్ల కుమారుడు జశ్వంత్ పై వీధి కుక్క ఆదివారం రాత్రి దాడి చేసింది. ఈదాడిలో బాలుడి జననేంద్రియానికి తీవ్రగాయమైంది. ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా.. వీధి కుక్క జశ్వంత్‌పై దాడి చేసింది. వెంటనే అతడిని తండ్రి భాస్కర్ చికిత్స నిమిత్తం మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చి వ్యాక్సిన్ వేయించారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేర్వేరు ఘటనల్లో సోమవారం ముగ్గురు మృతి చెందారు.


ధనసరి చిన్న లక్ష్మయ్య(ఫైల్)

గంగారం: తాటి కల్లు తాగి తీవ్ర అస్వస్థతకు గురైన మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం జంగాలపల్లికి చెందిన ధనసరి చిన్న లక్ష్మయ్య(50) చికిత్స పొంది ఇంటికి రాగానే ఆదివారం రాత్రి మృతి చెందాడు. లక్ష్మయ్య వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన భూమిలో ఉన్న తాటి చెట్లను ఆయన ఎక్కి కల్లు తీసి అమ్ముతున్నాడు. అయితే.. ఉగాది పండుగను పురస్కరించుకుని లక్ష్మయ్య వ్యవసాయ భూమిలోని తాటిచెట్లు ఎక్కి కల్లు దింపి ఇంటికి తీసుకొచ్చాడు. ఆయన కుటుంబ సభ్యులు ఐదుగురు కలిసి కల్లు తాగారు. ఈక్రమంలో లక్ష్మయ్య, రాజశేఖర్ తీవ్ర అస్వస్థతకు గురవడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించారు. ఈక్రమంలో రాజశేఖర్ కోలుకోగా.. రోజు రోజుకూ లక్ష్మయ్య ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. వైద్యులు బతకడం కష్టమే ఇంటికి తీసుకెళ్లాలని సూచించడంతో లక్ష్మయ్యను ఇంటికి తీసుకొచ్చారు. ఆదివారం రాత్రి ఇంట్లోనే మృతి చెందాడు. తాటి చెట్టుపై ఉన్న కల్లులో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు విషం కలపడంతోనే తన భర్త మృతి చెందాడని మృతుడి భార్య సారక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

చికిత్స పొందుతున్న రైతు..


థావుర్యా(ఫైల్)

మహబూబాబాద్ రూరల్: చికిత్స పొందుతూ మహబూబాబాద్ మండలం వేంనూర్ గ్రామ శివారు రాముర్తత్య తండాకు చెందిన బానోత్ థావుర్యా(45) సోమవారం మృతి చెందాడు. థావుర్యాకు మూడెకరాల భూమి ఉంది. అందులో మిర్చి, రెండెకరాల వరి సాగు చేశాడు. పంటల సాగు కోసం రూ.6 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై ఈనెల 10న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం అయనను మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రైతు మృతి చెందాడు. మృతుడి భార్య పూలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సీహెచ్ అరుణ్‌కుమార్ తెలిపారు.

ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఒకరు..

కాశిబుగ్గ: వరంగల్–చింతలపల్లి రైల్వేస్టేషన్ల మధ్య అబ్బనికుంట మైసమ్మ దేవాలయం సమీపం రైలు ఢీకొని గుర్తు తెలయని వ్యక్తి(40–45) మృతి చెందినట్లు వరంగల్ జీఆర్పీ సీఐ నరేశ్ తెలిపారు. సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా.. ఏదో రైలు నుంచి పడడం వల్ల మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతదేహంపై బూడిద కలర్ ప్యాంట్, వైట్‌కలర్ ఫుల్ షర్ట్ ఉన్నట్లు మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపర్చినట్లు వివరాలకు 9441557232లో సంప్రదించాలని సీఐ తెలిపారు.

నిట్‌లో ‘మీటర్’ సందడి

ఉత్సాహం నింపిన సినీ హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ అతుల్య


విద్యార్థుల కేరింతలు


విద్యార్థులతో మాట్లాడుతున్న సినీ హీరో కిరణ్ అబ్బవరం

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో సోమవారం మీటర్ సినిమా హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ అతుల్య రవి సందడి చేశారు. నిట్ వరంగల్‌లో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వని వేడుకల్లో భాగంగా మీటర్ మూవీ హీరో, హీరోయిన్లు తమ సినిమా ప్రమోషన్లో భాగంగా నిట్‌లో విద్యార్థులతో చిట్ చాట్ చేసి అలరించారు. స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వని ఫిల్మ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీటర్ సినిమా హీరో, హీరోయిన్ల లెట్స్ టాక్ షోలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈసందర్భంగా నిట్ విద్యార్థిని మేరి అడిగిన ప్రశ్నలతో పాటు విద్యార్థులతో ముఖాముఖి అయ్యారు. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. ‘మాది వ్యవసాయ కుటుంబం. పవన్‌కళ్యాణ్ స్ఫూర్తితో సినిమాల్లోకి వచ్చా. నేను తిరుపతిలో బీటెక్ చదువుతున్న తరుణంలో నా డ్రెస్సింగ్ చూసి వీడు వరెస్ట్ అని క్లాస్‌లోకి రానిచ్చేవారు కాదు. నాఫ్రెండ్స్ కూడా నన్ను వరెస్ట్ అని అనే వారు. కానీ చాలెంజ్‌గా తీసుకుని బెస్ట్‌గా ఎదిగాను’ అన్నారు.

నిట్ విద్యార్థులు మీటర్ మోగించాలి..

‘నేను తమిళ్ ఇండస్ట్రీ నుంచి తెలుగు ఇండస్ట్రీలో చేస్తున్న తొలి సినిమా మీటర్. ఏప్రిల్ 7న రిలీజ్ అవుతుంది, నిట్ విద్యార్థులు మీటర్ మోగించాలి. మూవీస్ చేస్తునే బీటెక్ పూర్తి చేసి ఎంటెక్ పూర్తి చేశాను. మీరంతా విద్యకు మొదటి ప్రాధాన్యం ఇచ్చాకే.. ఇష్టమైన రంగాన్ని ఎంచుకోండి’ అని మీటర్ హీరోయిన్ అతుల్య రవి అన్నారు.

కలర్‌ఫుల్‌గా ఎథికల్ నైట్

నిట్ వరంగల్‌లోని టైమ్ స్క్వేర్ ప్లాజా ఆవరణలో సోమవారం రాత్రి స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వనీ వేడుకల్లో భాగంగా సెంటర్‌ఫర్ వ్యాల్యూ ఎడ్యుకేషన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎథికల్ నైట్ కలర్‌ఫుల్‌గా సాగింది. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ఎత్నిక్‌వేర్ పేరిట నిర్వహించిన ప్రోగ్రాంలో అలరించారు. ఆరోహన్ డ్రామా పేరిట బాలీవుడ్ హీరో షారుఖ్‌ఖాన్, హీరోయిన్ దీపిక పదుకునే నటించిన ఓం శాంతి ఓం చిత్రాన్ని నాటక రూపంలో ఆవిష్కరించారు. ఆకాశంలోకి దీపాలను వదిలి లాంతర్ నైట్‌ను కలర్‌ఫుల్‌గా మార్చారు. నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు దంపతులు విద్యార్థులకు జోష్‌ను అందించేలా చేపట్టిన ర్యాంప్‌వాక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.